# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 18-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 19వ జీ-20 సదస్సులో పాల్గొనేందుకు రియో డి జనిరో నగరానికి చేరుకున్నారు.
- "నేషనల్ యూత్ ఫెస్టివల్"ను వచ్చే సంవత్సరం వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్‌గా జరుపుకుంటామని కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడల శాఖా మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా తెలిపారు.
- ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో ఈరోజు గాలి నాణ్యత మరింత క్షీణించింది.
- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) అసమానమైన వృద్ధిని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభినందించారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 116వ సంచిక ఈనెల 24వ తేదీన ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 19వ జీ-20 సదస్సులో పాల్గొనేందుకు బ్రజిల్ లోని రియో డి జనిరో నగరానికి చేరుకున్నారు. న్యాయమైన స్థిరమైన ప్రపంచాన్ని నిర్మించడం" అనే ఇతివృత్తంతో ప్రారంభమవుతున్న ఈ సమావేశంలో నరేంద్ర మోడీ ప్రసంగించనున్నారు. అంతకు ముందు బ్రెజిల్‌లోని భారతీయ సమాజం నుండి నరేంద్ర మోడీ కి హృదయ పూర్వక స్వాగతం లభించింది. రెండు రోజుల పాటూ జరగనున్న జీ-20 శిఖరాగ్ర సమావేశాల సందర్భంగా నరేంద్ర మోడీ పలు ద్వైపాక్షిక చర్చలు కూడా జరపనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

“నేషనల్ యూత్ ఫెస్టివల్”ను వచ్చే సంవత్సరం వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్‌గా జరుపుకుంటామని కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడల శాఖా మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా తెలిపారు. ఈరోజు న్యూఢిల్లీలో పాత్రికేయుల సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... జనవరి 11, 12వ తేదీల్లో జరగనున్న ఈ కార్యక్రమంలో నైపుణ్యం కలిగిన యువతను గుర్తించి వారికి సరైన వేదిక కల్పించి వారిని వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడంలో చోదకాలుగా మరల్చుకోవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

(వాయిస్ 22 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఈరోజుతో ముగిసింది. జార్ఖండ్‌లోని సంతాల్, కోయలాంచల్ ప్రాంతాల్లోని 38 నియోజకవర్గాల్లో రెండో దశ పోలింగ్ కోసం ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు ఈరోజు సాయంత్రం వరకు ముమ్మర ప్రచారం చేశాయి. ఈ దశలో, దుమ్కా, పికారిపాడ, డియోఘర్, లితిపరాతో సహా పలు నియోజకవర్గాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. పోలింగ్ నవంబర్ 20న, ఓట్ల లెక్కింపు 23న జరగనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో గాలి నాణ్యత మరింత క్షీణించింది. ఈరోజు సగటు వాయు నాణ్యత సూచిక 490 దాటడంతో ప్రమాదకర స్థాయిని చేరుకుంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తెలిపిన సమాచారం మేరకు, నగరంలోని కొన్ని ప్రాంతాల్లో వాయు నాణ్యత సూచిక 500 నమోదయ్యింది. ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో గాలి నాణ్యత క్షీణించడంతో పలు రైలు, విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. ఈ ప్రాంతంలో తక్కువ దృశ్యమానత ఏర్పడంతో దాదాపు 11 విమానాలు ఆలస్యం కాగా, 7 విమానాలను దారి మళ్లించారు. 13 రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయని ఉత్తర రైల్వే తెలిపింది. ఇదిలా ఉండగా కఠినమైన కాలుష్య నివారణ చర్యలను అమలు చేయడంలో జాప్యంపై సుప్రీంకోర్టు ఢిల్లీ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ముందస్తు అనుమతి లేకుండా నివారణ చర్యలను తగ్గించడానికి అనుమతించబోమని న్యాయస్థానం స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) అసమానమైన వృద్ధిని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభినందించారు. ముంబైలోని ఎస్‌బిఐ ప్రధాన కార్యలయం శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ... మూడు ప్రెసిడెన్సీ బ్యాంకులను కలిపి ఏర్పాటు చేసిన ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను ఎస్‌బిఐగా 250 శాఖలతో 1920లో మార్చారని, అది ఇప్పుడు 22 వేల 500 శాఖలు, 65 వేల ఏటీఎంలు, 85 వేల బ్యాంకింగ్ కరస్పాండెంట్లు, 50 కోట్ల మంది వినియోగదారులతో 'ఫార్చ్యూన్ 500'లో చోటు దక్కించుకున్న ఏకైక బ్యాంక్ SBI అని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 500 శాఖలను ఏర్పాటు చేయనుందని ఆర్థిక మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ దక్షిణాది దేశాల ప్రయోజనాలను కాపాడటానికి భారతదేశం ఇతర దేశాలతో కలిసి కృషి చేస్తుందని బ్రెజిల్‌లోని భారత రాయబారి సురేష్ కె రెడ్డి తెలిపారు. జీ-20 శిఖరాగ్ర సమావేశాల సందర్భంగా ఈరోజు ఆయన ఆకాశవాణితో మాట్లాడారు. బ్రెజిల్ భారత్ దేశాల మధ్య సానుకూల వాతావరణం ఉందని, ఈ రెండు దేశాల ఆర్థిక వ్యవస్థ ప్రపంచ దక్షిణాది దేశాల ప్రగతిలో చాలా కీలకమని పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నేపాల్ - భారత్ సరిహద్దు భద్రతా సమన్వయంపై అత్యున్నత స్థాయి సమావేశం ఈరోజు ఖాట్మండులో జరిగింది. సరిహద్దు ప్రాంతాల్లో నేరాల నియంత్రణ, సమాచార మార్పిడి, రెవెన్యూ లీకేజీ, అక్రమ మాదకద్రవ్యాల అక్రమ రవాణా, మానవ అక్రమ రవాణా నియంత్రణతోపాటు తృతీయ దేశాల పౌరుల అక్రమ ప్రవేశ నియంత్రణపై సమావేశంలో చర్చించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 116వ సంచిక ఈనెల 24వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 22వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

లక్సెంబర్గ్‌లో జిటి ఓపెన్‌లో మహిళల కాంపౌండ్ విభాగంలో జ్యోతి సురేఖ వెన్నం బంగారు పతకాన్ని గెలుచుకుంది. జీటీ - ఓపెన్‌లో తొలిసారిగా పోటీపడుతున్నప్పటికీ జ్యోతి సురేఖ టోర్నమెంట్ ఆసాంతం అద్భుతంగా పైచేయి సాదించింది. బెల్జియంకు చెందిన సారా ప్రిల్స్‌పై 147-145 తేడాతో విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ శాఖా మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశంలో పాల్గొనడానికి నవంబర్ 20 నుండి 22 వరకు లావోస్, వియత్నాం దేశాల అధికారిక పర్యటనకు వెళ్లనున్నారు. ఈ సమావేశంలో ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతా అంశాలపై ఆయన ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా అమెరికా, చైనా, ఆస్ట్రేలియా, జపాన్, లావోస్, మలేషియా, న్యూజిలాండ్, ఫిలిప్పీన్స్, దక్షిణ కొరియా దేశాలతో రక్షణ మంత్రి ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 77 వేల 863 లాభాల్లో ప్రారంభమై, చివరికి 77 వేల 339 వద్ద ముగిసింది. నిఫ్టీ 23 వేల 453 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.40గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 71.67 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2 వేల 596 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇటీవల ప్రారంభించిన ఆయుష్మాన్ వే వందన కార్డ్ 70 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు గల 10 లక్షల మంది వయో వృద్ధులు నమోదు చేసుకోవడం ద్వారా ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించింది. ఈ కార్డ్ ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన కింద ఉచిత ఆరోగ్య సంరక్షణ ప్రయోజనాలను పొందేందుకు వృద్ధులకు ఉపయోగ పడుతుంది. అక్టోబరు 29న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన మూడు వారాల్లోనే ఈ మైలురాయిని సాధించినట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =